ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కర్ణాటక వార్తలు
శనివారం 30 నవంబరు 2024

ధర లేక అన్నదాత దిగాలు..!

నేల చూపులు చూస్తున్న ధాన్యం ధర

కొనేవారు లేక కల్లాల్లోనే వరి దిగుబడి

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించని సర్కారు

దిక్కుతోచని స్థితిలో రైతులు



8

పిల్లల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు

మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్


చిన్నారులకు శౌర్య, అత్యుత్తమ పురస్కారాలు



7

నిరసన సౌధ..!

- సువర్ణసౌధ ఎదుట పోరుకు వ్యూహాలు
- 5వేల ట్రాక్టర్లతో ముట్టడికి పంచమశాలీల ప్రయత్నాలు
- వక్ఫ్ నోటీసుల బాధిత రైతుల కసరత్తు
- బకాయి వేతనాల కోసం ఆర్టీసీ ఉద్యోగులు
- మహామేళావ్ నిర్వహణకు ఎంఈఎస్ వినతి



బెంగళూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటకను ప్రత్యేక రాష్ట్రం చేయాలనే డిమాండ్ అప్పుడప్పుడు తెరపైకి వస్తుండడంతో సమైక్య కర్ణాటకను అభిమానించేవారికి భంగం కలుగుతుందని భావించి దశాబ్దన్నర కాలం క్రితం బెంగళూరు విధానసౌధ తరహాలోనే బెళగావిలో 'సువర్ణసౌధ'ను నిర్మించారు. ఉత్తర కర్ణాటక ప్రాంతంలో ప్రధాన నగరంగానే కాకుండా మహారాష్ట్ర, గోవాలకు సరిహద్దున ఉన్న కీలకమైన ప్రాంతం కావడంతో బెళగావి కేంద్రంగా సువర్ణసౌధ ఏర్పాటైంది. ఏటా శాసనసభ శీతాకాల సమావేశాలు బెళగావిలో నిర్వహించాలని దశాబ్దాల క్రితమే తీర్మానించారు. అందుకు అనుగుణంగానే ఏటా శాసనసభ శీతాకాల సమావేశాలు బెళగావిలో జరుపుతారు. తద్వారా ఉత్తర కర్ణాటక సమస్యలపై చర్చలు జరుగుతాయని విధాన పరిషత్, శాసనసభ సభ్యులతోపాటు ముఖ్యమంత్రి, మంత్రులు రావడం ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయనే కుతూహలం ఉత్తరకర్ణాటక వాసులలో ఏటా వస్తుంటుంది. అయితే దశాబ్దకాలంగా ప్రతి సంవత్సరం శాసనసభ శీతాకాల సమావేశాల వేళ సభలో చర్చలకంటే సువర్ణసౌధ చుట్టూ వందలకొలదీ ఆందోళనలు, నిరసనల పోరాటాలు సాగుతుంటాయి.

- ప్రధానంగా రైతులు వివిధ సమస్యలపై పోరాటాలు పలుమార్లు హింసాత్మకంగాను సాగాయి. గతంలో ఓ రైతు సువర్ణసౌధ ముందే ఆత్మహత్యకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఇక బెళగావిలో నివసించే మరాఠాలు, మహారాష్ట్ర ఏకీకరణ సమితి (ఎంఈఎస్) ద్వారా ఏటా నిరసనలు చేపట్టడం సంప్రదాయంగా మారిపోయింది. బెళగావితోపాటు ఈ ప్రాంతంలో మరాఠాలు అత్యధికంగా ఉండే గ్రామాలు, పట్టణాలను మహారాష్ట్రలో విలీనం చేయాలనేది వారి డిమాండ్‌గా ఉంది. కన్నడ రాజ్యోత్సవం నవంబరు 1న రాష్ట్రమంతటా ఓ పండుగలా జరుగుతుంటే బెళగావిలో మాత్రం మహామేళావ్ పేరిట నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యే రోజు కూడా వేలాదిమంది ఎంఈఎస్ కార్యకర్తలు నిరసన చేపట్టి ఏకంగా ఎమ్మెల్యేలు, మంత్రులపై దాడులకు దిగిన సంఘటనలు చోటు చేసుకున్నాయి.

మరోసారి నిరసనలకు సై అంటున్న సంఘాలు

శాసనసభ శీతాకాల సమావేశాలు డిసెంబరు 9 నుంచి 19వరకు జరగనున్నాయి. వాస్తవానికి 20వ తేదీ వరకు జరగాల్సి ఉన్నా అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం జరుగుతున్న తరుణంలో ఒక రోజు ముందే సమావేశాలను ముగించదలిచారు. దీంతో తొలిరోజున కొన్ని సంఘాలు, 10న మరికొన్ని సంఘాలు, ఉద్యోగులు ఆందోళన చేయదలిచారు. రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్‌బోర్డు పలువురు రైతులకు తమ భూములంటూ నోటీసులు జారీ చేసింది. ఈ పరిణామం ఉత్తర కర్ణాటక పరిధిలోని బీదర్, విజయపుర, కలబురగితోపాటు పలు జిల్లాల్లో తీవ్ర ప్రభావం చూపుతోంది. కొన్ని జిల్లాలకు నోటీసులు ఇచ్చినా మరిన్ని జిల్లాల రైతులకు ఏ క్షణంలోనైనా నోటీసులు రావచ్చుననే ప్రచారంతో అన్నదాతలు వణికిపోతున్నారు. రెండు మూడు తరాలుగా సాగు చేసుకుంటూ వచ్చిన భూములకు వక్ఫ్‌బోర్డు నోటీసులు ఇవ్వడం భవిష్యత్తు జీవనాధారం వేలాది కుటుంబాలకు ప్రశ్నార్థకం అవుతోంది. ఇలా వక్ఫ్ బాధిత రైతులు ఆందోళన చేయదలిచారు. బాధితులంతా సువర్ణసౌధకు వస్తే పెను సంచలనమే చోటుచేసుకోనుంది.

బకాయి వేతనాల కోసం ఆర్టీసీ ఉద్యోగులు

నాలుగు కార్పొరేషన్‌ల ఆర్టీసీ ఉద్యోగులు బకాయి వేతనాలు, పీఎఫ్ చెల్లింపుల జాప్యంపై నిరసన చేపట్టదలిచారు. డిసెంబరు 1న సాంకేతికంగా నిరసన చేపట్టి శాసనసభ శీతాకాల సమావేశాల వేళ సువర్ణసౌధ ఎదుట ఆందోళన చేయదలిచారు. అదే జరిగితే వేలాదిమంది ఆర్టీసీ ఉద్యోగులు బెళగావికి చేరుకునే అవకాశం ఉంది. వీరితోపాటు చెరకు రైతులు వివిధ ప్రాజెక్టులకోసం భూములు కోల్పోయిన బాధితులు ఇతరత్రా ఉద్యోగులు, ప్రజా సంఘాలు ఆందోళన చేయదలిచాయి.

5వేల ట్రాక్టర్లతో సువర్ణసౌధ ముట్టడి

పంచమశాలీలకు రిజర్వేషన్ కల్పించే విషయంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ 5వేల ట్రాక్టర్లతో లక్షలాదిమంది సువర్ణసౌధను ముట్టడిస్తామని లింగాయత పంచమశాలి జగద్గురు బసవజయ మృత్యుంజయ స్వామీజీ ప్రకటించారు. రెండు రోజులకిందటే బెళగావిలో ఏర్పాట్లను పరిశీలించారు. ఇదే సందర్భంలో మీడియాతో మాట్లాడుతూ పంచమశాలీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. గతంలో జగదీశ్‌శెట్టర్, యడియూరప్ప, బొమ్మైలు సీఎంలుగా ఉన్నప్పుడు ఆందోళన చేశామన్నారు. డిసెంబరు 10న 5వేల ట్రాక్టర్‌లతో ముట్టడి చేస్తామన్నారు. 2ఏ రిజర్వేషన్ కల్పించడంలో పంచమశాలీ లింగాయతలకు ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయన్నారు.



మాట్లాడుతున్న బసవజయ మృత్యుంజయ స్వామీజీ

6వేలమందితో బందోబస్తు

శాసనసభ శీతాకాల సమావేశాల ప్రారంభం నుంచే ప్రజాసంఘాలు, ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమవుతున్న తరుణంలో 6వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయదలిచారు. ఇప్పటికే శాసనసభ సమావేశాలు జరిగే అన్ని రోజులు విధులకోసం ఉత్తర కర్ణాటకతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల పోలీసు అధికారులు, సిబ్బందిని కేటాయించారు. ఐజీపీ వికాస్‌కుమార్, నగర పోలీస్ కమిషనర్ యడా మార్టిన్, ఎస్పీ భీమాశంకర్ గుళేద్ ఆదేశాలు జారీ చేశారు.

మహామేళావ్ నిర్వహణకు ఎంఈఎస్ వినతి

మహారాష్ట్ర ఏకీకరణ సమితి (ఎంఈఎస్) ఆధ్వర్యంలో మహామేళావ్‌ను నిర్వహిస్తామని ప్రకటించారు. ఈమేరకు ఎంఈఎస్ కార్యకర్తలు బెళగావి జిల్లా అధికారిని కలసి వినతిపత్రాన్ని అందించారు. అందుకు తగిన సౌలభ్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం సరిహద్దు ప్రాంతంలోని మరాఠీ మాట్లాడేవారికి అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఎంఈఎస్ కార్యాధ్యక్షుడు మనోహర కిణికెర, ముఖ్యులు రంజిత్‌చౌహాన్ పాటిల్, ప్రకాశ్ మరగాలె, మాలోజి అస్టేకర, రామచంద్ర మోదకెరె, వికాస కలఘటగి జిల్లా అధికారి మహ్మద్ రోషన్‌కు వినతిపత్రం ఇచ్చారు. అందుకు జిల్లా అధికారి స్పందిస్తూ శాసనసభ సమావేశాలు జరిగేవేళ నిరసన తెలిపేందుకు అవకాశం ఉందని, కానీ హింసాత్మక సంఘటనలకు అవకాశం ఇచ్చేది లేదని హెచ్చరించారు.



జిల్లా అధికారి మొహమ్మద్ రోషన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంఈఎస్ కార్యకర్తలు



ప్రధాని మోదీతో సీఎం సిద్దరామయ్య చర్చలు

నాబార్డు రుణాల పరిమితి పెంచండి


- భద్ర ఎగువ ప్రాజెక్టు గ్రాంటు విడుదల చేయండి
- మేకెదాటుకు అనుమతులు ఇప్పించండి
- ప్రధానమంత్రికి సీఎం వినతి

బెంగళూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు నాబార్డు రుణాల పరిమితి 58 శాతానికి తగ్గించారని వాటిని పెంచాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీని సీఎం సిద్దరామయ్య కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. వాటిపై సీఎం ఒక్కో అంశంగా ప్రధానమంత్రికి వివరించారు. 2023-24లో నాబార్డు రూ.5,600 కోట్ల రుణం అందించిందని, 2024-25 నాటికి 2,340 కోట్లకు తగ్గించారని తద్వారా 58 శాతం కోత పెట్టినట్టయ్యిందన్నారు. నాబార్డు సాయంతో చిన్న, సన్నకారు రైతులకు రుణాలు ఇచ్చేందుకు అనుకూలంగా ఉంటుందని, ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురవడంతో రైతులకు అనుకూలమయ్యేలా నాబార్డు రుణాలు పెంచాలని కోరారు. 2023-24 బడ్జెట్‌లో భద్ర ఎగువ ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లు గ్రాంటు ప్రకటించారని వాటిని వెంటనే విడుదల చేయించాలని విన్నవించారు. రాష్ట్రంలో పలు ప్రాజెక్టులకు అటవీశాఖ అభ్యంతరాలు ఉన్నాయని, ప్రధానంగా మేకెదాటు, కళసా-బండూరిలకు అనుమతులు ఇప్పించాలని కోరారు. రాష్ట్రంలోని 13 మహానగర పాలికెలు ఉన్నాయని, మహాత్మాగాంధీ నగర వికాస యోజన కింద అదనపు గ్రాంట్లు కేటాయించాలని కోరారు. 16వ ఆర్థికసంఘం పరిధిలో పన్నుల వాటాను తగ్గించడంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పెనుభారం పడుతోందని, పరిశీలించి పరిమితి పెంచాలని కోరారు.

నాబార్డు రుణాల్లో కోత.. పంట దిగుబడులకు నష్టం

నాబార్డు రుణాలలో కోత పంట దిగుబడులకు నష్టమని సీఎం సిద్దరామయ్య అన్నారు. ప్రధానమంత్రిని భేటీ అయ్యాక కర్ణాటక భవన్‌లో సీఎం మీడియాతో మాట్లాడారు. రైతులకు సబ్సిడీ రూపంలో ఇచ్చే రుణాలలో కోత పంట దిగుబడులపై ప్రభావం చూపనుందన్నారు. రాష్ట్రం, కేంద్రంలో ఆహార ఉత్పత్తిపై దుష్పరిణామానికి కేంద్ర విధానాలు కారణం కానున్నాయన్నారు. కేవలం కర్ణాటకకు మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు నాబార్డు రుణాలలో కోత విధించారన్నారు. రాష్ట్రానికి చెందిన పార్లమెంటు సభ్యులు నోరు తెరవడం లేదని మండిపడ్డారు. కేంద్రమంత్రిగా వ్యవహరించే కుమారస్వామి, రాజ్యసభ సభ్యుడు దేవెగౌడ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు.

సీఎం ఆత్మాభిమాన సదస్సుకు రాహుల్ ఓకే



బెంగళూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హాసన్‌లో సీఎం సిద్దరామయ్య ఆత్మాభిమాన సదస్సుకు విమర్శలు తలెత్తడంతో పాటు ఏకంగా కొందరు అధిష్టానానికి లేఖ రాసి అనుమతులు ఇవ్వరాదని పంపడంపై వస్తున్న భిన్నాభిప్రాయాల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సీఎం సిద్దరామయ్యపై ముడా ఇంటి స్థలాల అవినీతి వివాదంలో సాగుతున్న పరిణామాల నేపథ్యంలో డిసెంబరు 5న హాసన్‌లో ఆత్మాభిమాన సదస్సు ఏర్పాటుకు రెండువారాలుగా రహస్య కార్యాచరణ సాగుతోంది. ఇటీవల నాలుగు రోజుల కిందట మంత్రులు రాజణ్ణ, మహదేవప్ప, సిద్దరామయ్య కుమారుడు యతీంద్ర హాసన్‌లో సభాస్థలిని సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించడం బహిరంగమైంది. అంతలోనే హోంమంత్రి పరమేశ్వర్ హాసన్ సభ గురించి తెలియదని వ్యాఖ్యానించడం, మరికొందరు కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా సభ జరపడం ఏ విధమైన సంస్కృతి అంటూ అధిష్టానానికి లేఖలు పంపించారు. మంత్రులు, శాసనసభ్యులు పాల్గొనే సభను పార్టీతో సంబంధం లేదని ఏవిధంగా అర్థం చేసుకోవాలని లేఖలో ప్రస్తావించారు. దీంతో హాసన్ సభపై అధిష్టానం ఏవిధమైన నిర్ణయాలు తీసుకుంటుందనేది ఉత్కంఠగా మారింది. కాగా ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం సిద్దరామయ్య ఉదయం రాహుల్‌గాంధీతో భేటీ అయిన సందర్భంలో హాసన్ సభ అంశం ప్రస్తావనకు ఇందుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇదే విషయాన్ని సీఎం ప్రకటించారు. దీంతో హాసన్ సభ మరింత ఉత్సాహంగా సాగేందుకు కారణమవుతోంది. హాసన్‌తో పాటు మండ్య, మైసూరు, కొడుగు, చామరాజనగర్, రామనగర్ తదితర జిల్లాల నుంచి పార్టీ కార్యకర్తలు, రాష్ట్రవ్యాప్తంగా సిద్దరామయ్య అభిమానులు సభకు తరలివచ్చే అవకాశాలు ఉన్నాయి. 2023 శాసనసభ ఎన్నికలకు ముందు దావణగెరెలో సిద్దరామయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని సిద్దరామోత్సవ సభ భారీ స్థాయిలో విజయవంతమైన విషయం తెలిసిందే. ఇటీవల మూడు శాసనసభ స్థానాలలో గెలుపుద్వారా జేడీఎస్ కోటను బద్దలు కొట్టామనే ఉత్సాహంలో దేవెగౌడకు పుట్టినిల్లుగా ఉన్న హాసన్‌లో భారీ సభ ద్వారా సవాల్ విసరాలనే ఆత్మాభిమానం సభను ఏర్పాటు చేశారు.

నేడు ఏపీ సీఎం చంద్రబాబు రాక

- బళ్లారికి చేరుకున్న అధికారులు, టీడీపీ నాయకులు



బళ్లార్జి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు శనివారం అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బొమ్మనహాళ్ మండలం నేమకల్లు ఇందిరమ్మ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ముఖ్యమంత్రి పంపిణీ చేస్తారు. ఆ తరువాత నేమకల్లు గ్రామస్థులతో చంద్రబాబు సమావేశమౌతారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి శనివారం ఉదయం రోడ్డుమార్గాన విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో కర్ణాటకలోని బళ్లారి జిల్లా జిందాల్ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడ చంద్రబాబును అభిమానులు కలిసి సత్కరించే అవకాశం ఉంది. అనంతరం హెలిక్యాప్టర్‌లో నేమకల్లుకు బయలుదేరుతారు. చంద్రబాబు బెంగళూరు నుంచి అనంతపురం జిల్లాకు వచ్చేలా అధికారులు మొదట రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. అక్కడి నుంచి 300 కి.మీ. పైగా దూరం ఉంటుంది. అదే బళ్లారి నుంచి నేమకల్లుకు కేవలం 25 కి.మీ. దూరం ఉంది. దీంతో బళ్లారి నుంచి వెళ్లేలా పర్యటనలో మార్పులు చేశారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పలువురు జిల్లా అధికారులు, టీడీపీ ముఖ్య నాయకులు శుక్రవారం రాత్రికే బళ్లారికి చేరుకున్నారు. కర్ణాటకకు చెందిన అభిమానులు జిందాల్‌లో చంద్రబాబును కలిసి సన్మానించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

పింఛన్ల పంపిణీ..

సీఎం చంద్రబాబు నేమకల్లుకు చేరుకోగానే ఎంపిక చేసిన లబ్ధిదారుడి నివాసానికి వెళ్లి పింఛన్ అందజేస్తారు. అనంతరం నేమకల్లు ఆంజనేయస్వామిని దర్శించుకుని, గ్రామస్థులతో సమావేశమౌతారు. పర్యటన ముగించుకుని, మధ్యాహ్నం 3.45 గంటలకు హెలిక్యాప్టర్‌లో తిరిగి వెళతారు. నేమకల్లులో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ దగ్గరుండి పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 500 మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు.

గవర్నర్‌కు చాన్స్‌లర్ హోదా కోత

- గ్రామీణాభివృద్ధి యూనివర్సిటీకి చాన్స్‌లర్‌గా సీఎం
- కేబినెట్ తీర్మానంపై బీజేపీ ఆగ్రహం

బెంగళూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ పర్యవేక్షణలోని యూనివర్సిటీలకు గవర్నర్ చాన్స్‌లర్‌గా కొనసాగే హోదాకు కత్తెర వేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. గదగ్‌లోని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ యూనివర్సిటీకి చాన్స్‌లర్ హోదా నుంచి గవర్నర్‌ను తప్పించారు. సీఎం సిద్దరామయ్యకు చాన్స్‌లర్ హోదాను కేటాయిస్తూ మంత్రివర్గం గురువారం నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక యూనివర్సిటీలకు గవర్నర్ చాన్స్‌లర్‌గా కొనసాగే విధానం సుదీర్ఘకాలంగా ఉంది. రాష్ట్రంలో తొలిసారి గవర్నర్‌కు ఈ హోదాను తప్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే గుజరాత్‌తోపాటు పలు రాష్ట్రాల్లో ఈ విధానం కొనసాగుతోంది. దీంతోపాటు కేబినెట్‌లో పలు కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. అసంఘటిత కార్మికుల సంక్షేమనిధి సవరణ బిల్లును ఆమోదించారు. భూగర్భజల సవరణ బిల్లుకు అంగీకారం తెలిపారు. జీఎస్టీకి సంబంధించి బీబీఎంపీ రెండోసవరణకు ఆమోదించారు. విజయపుర జిల్లా బసవనబాగేవాడి అభివృద్ధి ప్రాధికారకు అంగీకారం తెలిపారు. రాష్ట్రంలో పలు పర్యాటక కేంద్రాలలో రోప్‌వేను నిర్మించేందుకు అంగీకారం తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉపకరణాల కొనుగోలుకు ఆమోదించారు. పేద విద్యార్థులకు ఉచిత వసతి, రూ.2500 కోట్లతో 500 కర్ణాటక పబ్లిక్ స్కూళ్లను నిర్మించదలిచారు.

బీజేపీలో తారస్థాయికి విభేదాలు

- కురుడుమలెలో విజయేంద్ర మద్దతుదారుల పూజలు
- అధిష్టానాన్ని కలిసే వస్తాం - యత్నాళ్ పట్టు

బెంగళూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకొనే బీజేపీలో విభేదాలు తారస్థాయికి చేరాయి. వక్ఫ్ బోర్డు రైతులకు నోటీసులు జారీ చేసిన వివాదంపై గ్రూపులవారీగానే ముందుకెళ్తున్నారు. పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర వ్యతిరేక కూటమికి నాయకత్వం వహిస్తున్న ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ బీదర్ నుంచి యాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. తాజాగా ఉప ఎన్నికల్లో మూడుస్థానాలను పార్టీ కోల్పోవడంతో అధ్యక్షుడికి వ్యతిరేకంగా యత్నాళ్ తీవ్రస్థాయిలోనే విమర్శలు చేశారు. తండ్రి యడియూరప్ప, కొడుకు విజయేంద్రల వ్యామోహంలో అధిష్టానం పడరాదన్నారు. ఇలా సాగుతుండగానే అధిష్టానం ఢిల్లీకి రావాలని యత్నాళ్‌కు సూచించింది. తాను ఒక్కడినైతే ఢిల్లీకి వచ్చేది లేదని, సహచరులతో కలసి వస్తానన్నారు. ఇలా సాగుతుండగానే యత్నాళ్‌కు వ్యతిరేకంగా విజయేంద్రను బలపరుస్తున్న వర్గీయులు కోలారు జిల్లా ముళబాగిలు తాలూకా కురుడుమలె వినాయక దేవస్థానంలో శుక్రవారం పూజలు జరిపారు. మాజీ మంత్రి కట్టా సుబ్రమణ్యం నాయుడు, మాజీ ఎమ్మెల్యే రేణుకాచార్య, బీసీ పాటిల్‌తోపాటు పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు పూజల్లో పాల్గొన్నారు. చాముండి కొండలు, గోకర్ణకు వెళ్లి పూజలు చేసి ఆ తర్వాత తమ సత్తా చూపుతామని సవాల్ విసిరారు.

సుస్థిర భవిష్యత్తుకు దేశీయ విద్యావిధానం ఉత్తమం

- రేవా స్నాతకోత్సవంలో యూజీసీ చైర్మన్

బెంగళూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సుస్థిర భవిష్యత్తుకు దేశీయ విద్యావిధానం ఉత్తమమనీ, ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానం రాజ్యాంగంలోని సమానతతో కూడిన బద్ధతను ఉదహరిస్తుందని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ ప్రొఫెసర్ మామిడాళ జగదీశ్‌కుమార్ అన్నారు. రేవా యూనివర్సిటీ స్నాతకోత్సవం శుక్రవారం జరిగింది. రేవా చాన్సిలర్ డాక్టర్ పి శ్యామరాజు అధ్యక్షత వహించారు. విద్యార్థులను ఉద్దేశించి యూజీసీ చైర్మన్ మాట్లాడుతూ.. అర్థశాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ పురస్కార గ్రహీతలు సాధకులను కొనియాడారు. విద్యాసంస్థలలో గుణాత్మకత ద్వారా దేశ సమృద్ధి, పరిశోధనలు ఆవిష్కరణలు సాధ్యమవుతాయన్నారు. మనదేశంలో రాజ్యాంగం ఇక్కడి పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాప్రభుత్వం, ఎన్నికల ప్రక్రియ, న్యాయ, సమాచార వ్యవస్థలు ధృడంగా ఉన్నందుకు గర్వపడాలన్నారు. ఇవి రాజ్యాంగ విలువలలోనే ఉన్నాయన్నారు. జాతీయ విద్యావిధానం పరివర్తన సామర్థ్యం కలిగినదన్నారు. ప్రభుత్వాలు విద్యాలక్ష్మి, పీఎం ఇంటర్న్‌షిప్, వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్ పథకాల ద్వారా విద్యాభవిష్యత్తును ఏ విధంగా రూపొందించాలనేది స్పష్టంగా ఉందన్నారు. ఉన్నత విద్య సరళీకృతంతోపాటు విశ్వవిద్యాలయాలు, పరిశోధన, పర్యావరణ వ్యవస్థకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భారతీయ భాషా వైవిధ్యం గురించి ప్రస్తావిస్తూ మాతృభాషలో విద్యను అందిస్తే మహత్తరమైన ఫలితాలు సాధ్యమన్నారు. ఈ విధానం పరిశోధనల ద్వారా కూడా రుజువైందన్నారు. రేవా చాన్సలర్ శ్యామరాజు మాట్లాడుతూ రేవాలో గుణాత్మకత ప్రాధాన్యత ఇస్తామని మౌలిక సదుపాయాలతోపాటు పరిశోధనలకు ప్రాధాన్యం కొనసాగిస్తున్నామన్నారు. సామాజిక సేవలకు రేవా కట్టుబడి ఉందన్నారు. విద్యాసంస్థ ద్వారా సమాజానికి ఏ విధమైన సేవ అందించాలనే బాధ్యతతో వ్యవహరిస్తున్నామన్నారు. యువతను నైపుణ్యవంతంగా తీర్చే కీలక బాధ్యత అధ్యాపకులదేనని అన్నారు. ఇదే సందర్భంగా 3311 మంది విద్యార్థులకు డిగ్రీ, 1156 మందికి పీజీ, 70మందికి పీహెచ్‌డీ పట్టాలను ప్రదానం చేశారు. 60మంది ప్రతిభావంత విద్యార్థులకు బంగారు పతకాలతో సత్కరించారు. ప్రొ-చాన్సలర్ ఉమేశ్ ఎస్ రాజు పాల్గొన్నారు.



స్నాతకోత్సవ వేదికపై ప్రముఖులు



పట్టాలు ప్రదానం చేస్తున్న యూజీసీ చైర్మన్ జగదీశ్‌కుమార్, రేవా చాన్సిలర్ శ్యామరాజు

న్యూస్‌బాక్స్

విద్యాశాఖలో ఇద్దరు ఏడీల బదిలీ

అనంతపురం విద్య, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)లు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)లు, డిప్యూటీ డీఈఓలను బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేయగా శుక్రవారం బయటకొచ్చాయి. అనంతపురం జిల్లా డీఈఓ ఆఫీస్‌లో ఏడీగా పనిచేస్తూ, సమగ్రశిక్ష ప్రాజెక్టులో ఇన్‌చార్జ్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ (ఏపీసీ)గా వ్యవహరిస్తున్న నాగరాజు బదిలీ అయ్యారు. ఆయనకు విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి పోస్టింగ్ ఇచ్చారు. పెనుకొండ డివిజన్ డిప్యూటీ డీఈఓగా పనిచేస్తున్న ఏడీ రంగస్వామిని సైతం బదిలీ చేశారు. ఆయనను చిత్తూరు జిల్లా డీఈఓ కార్యాలయ ఏడీగా నియమించారు.

ఉచిత డీఎస్సీ శిక్షణ

అనంతపురం ప్రెస్‌క్లబ్/పుట్టపర్తిరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని మైనార్టీ విద్యార్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రెండు జిల్లాల మైనార్టీ సంక్షేమశాఖ ఏడీలు రామసుబ్బారెడ్డి, రమణారెడ్డిలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముస్లిం, క్రైస్తవులు(బీసీ-సి), సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీ తదితర కేటగిరీల విద్యార్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే వీరందరికీ శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన సంస్థలు, అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రఖ్యాత ప్రైవేట్ సంస్థలతో ఎంప్యానెల్ చేయడం ద్వారా ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో శిక్షణ పొందగోరు వారు, అలాగే శిక్షణ ఇవ్వదలచిన సంస్థలు లేదా అభ్యర్థులు www.apcedmmwd.org పోర్టల్ ద్వారా లేదా విజయవాడలోని మైనార్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయానికి దరఖాస్తులు పంపాలన్నారు. వివరాలకు ఫోన్ : 0866-2970567 సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

దుడ్లు ఖర్చు పెట్టండి

- వాటర్‌షెడ్ నిధులు మార్చిలోపు వినియోగించుకోవాలి
- రాష్ట్ర డైరెక్టర్ షణ్ముఖకుమార్



హంపాపురంలో పనులను పరిశీలిస్తున్న వాటర్‌షెడ్ రాష్ట్ర డైరెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సహజ వనరుల యాజమాన్యం (ఎన్‌ఆర్‌ఎం) కింద జిల్లాకు కేటాయించిన వాటర్‌షెడ్ ప్రాజెక్టు నిధులను వచ్చే మార్చిలోపు వినియోగించుకోవాలని, లేని పక్షంలో వెనక్కు చెల్లించాలని ఏపీ రాష్ట్ర వాటర్‌షెడ్ పథకం డైరెక్టర్ షణ్ముఖకుమార్ తెలిపారు. జిల్లాలోని శింగనమల మండలం వెస్ట్ నరసాపురం, రాప్తాడు మండలం హంపాపురం, కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామాల్లో చేపట్టిన వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో రైతులతో మాట్లాడారు. రైతులకు అవసరమైన రాతికట్టడాలు, ఫాం పాండ్లు, చెక్ డ్యాంలు, కుంటలను సహజ వనరుల యాజమాన్యం కింద కేటాయించిన నిధులతో నిర్మించాలని ఆధికారులను ఆదేశించారు. అమృత్‌సరోవర్, ఎన్‌ఆర్‌ఎం పనులను పరిశీలించారు. ఇటీవల హంపాపురం వాటర్‌షెడ్ ప్రాజెక్టుకు జాతీయ స్థాయి అవార్డు వచ్చిన నేపథ్యంలో అదే స్ఫూర్తితో మరిన్ని అభివృద్ధి పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వాటర్‌షెడ్ అడిషినల్ పీడీ సుధాకర్ రెడ్డి, ఏపీడీ కృష్ణచైతన్య, ఏపీలు శ్రీవిద్య, పెద్ద ఈశ్వరయ్య, సిబ్బంది, వాటర్‌షెడ్ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు గాయకుల ఎంపిక

అనంతపురం అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని కళాకారులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశ్యంతో నూరేళ్ల నా ఊరు కావ్యం పాడేందుకు అనంతపురంలో డిసెంబరు 1న గాయనీ గాయకులను ఎంపిక చేయనున్నట్లు ప్రముఖ సినీ గేయ రచయిత, ప్రజా కవి వరంగల్ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అనంతపురం ప్రెక్ క్లబ్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా గాయనీ, గాయకుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 243 చరణాల గేయ కావ్యాన్ని 243 మంది గాయనీ గాయకులతో ఆలపించేందుకు ఈ ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహిసున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయవాది వాల్మీకి హరి, జూపాక శివ, మహేష్, శీను, డాక్టర్ రామాంజనేయులు, వెంకటరావు, యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

రబీపైనే ఆశలు

- విస్తారంగా వేరుశనగ సాగు
- ఖరీఫ్ నష్టాలకు వెరవని రైతన్న



వేరుశనగ పంట

చెన్నేకొత్తపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సాగు రైతులకు తీవ్ర నష్టాలను మిగిల్చింది. వర్షాభావ పరిస్థితుల వల్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతింది. కొన్ని ప్రాంతాల్లో అసలు సాగే చేయలేదు. కనీసం సాగు చేసిన చోట కూడా పెట్టుబడులు రాని పరిస్థితి. అయినా సేద్యంపై మమకారం పోగొట్టుకోని రైతన్న రబీలోనైనా మంచి పంటలు పండిద్దామన్న సాగుకు సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే చాలా మంది విత్తన సాగును ప్రారంభించారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో బోరుబావుల కింద విరివిగా పంట సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

కష్టాల ఖరీఫ్

ఖరీఫ్ సీజన్‌లో వరుణుడు ముఖం చాటేయడంతో చాలా వరకు పంట తీవ్రంగా దెబ్బతింది. కొన్ని చోట్ల పంట సాగు కాకపోవడంతో భూములు బీళ్లుగా మారాయి. వ్యవసాయ అధికారులు తెలిపిన మేరకు చెన్నేకొత్తపల్లి మండలంలో 35వేలకు ఎకరాలకు గాను 8547 ఎకరాల్లో మాత్రమే పంట సాగైంది. రామగిరిలో 28వేలకు ఆరు వేలు, కనగానపల్లిలో 35వేలకు 14,846 ఎకరాలలో పంట సాగైనట్లు అధికారులు చెబుతున్నారు.

జోరుగా సాగు

రబీ సీజన్ మీద ఆశతో రైతులు నవంబరు ప్రారంభం నుంచే వేరుశనగను సాగుచేస్తున్నారు. సీకేపల్లి మండలంలో ప్రస్తుతానికి 150 హెక్టార్లకు పైగా సాగు అవ్వగా రామగిరిలో 120, కనగానపల్లి 130 హెక్టార్ల వరకు పంట సాగైనట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. డిసెంబరు 15 వరకు సమయం ఉండటంతో సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకావం ఉందని వారు వెల్లడించారు. వరుస తుఫాన్‌ల ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా బోర్లలో నీరు సంవృద్ధిగా ఉండటంతో వేరుశనగ సాగువైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

నాలుగు ఎకరాల్లో పంట సాగు చేశా



రెండు వారాల కిందట నాలుగు ఎకరాలలో వేరుశనగ పంట సాగు చేశా. గత ఖరీఫ్‌లో పంట దెబ్బతిని నష్టపోయా. ఈసారైన పంట దిగుబడి వస్తుందన్న నమ్మకంతో బోరు కింద బావుల కింద పంట సాగుచేశా.

- వెంకటేశ్, రైతు, మేడాపురం, సీకేపల్లి

ఖరీఫ్‌లో నష్టపోయా



ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగపంటను సాగు చేసి నష్టపోయా. బోర్లలో నీరు తక్కువ ఉన్నప్పటికీ వర్షాన్ని నమ్ముకుని వేరుశనగ పంట వేశా. అయితే వర్షాలు రాక, బోర్లలో నీరు లేక పంట దెబ్బతిని నష్టపోయా. ప్రస్తుతం రబీ కింద ఐదెకరాలలో పంటను సాగుచేశా.

- శ్రీనివాసులు, రైతు, మామిళ్లపల్లి, కనగానపల్లి

విత్తనశుద్ధి తప్పనిసరి



రబీలో వేరుశనగ సాగుకు ఎక్కువమంది రైతులు మొగ్గు చూపుతున్నారు. పంట సాగులో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. ఎకరా దుక్కిలోకి బస్తా యూరియా, మూడు బస్తాల సూపర్, అర బస్తా పొటాష్‌ను కలిసి వేసుకోవాలి. ఎకరాకు 70 నుంచి 100కిలో విత్తనాన్ని ఇరుసాళ్లుగా విత్తుకోవాలి. మొలకెత్తిన తరువాత 25రోజుల నుంచి 30 రోజుల్లోపు మొదటి స్ప్రే ఒకలీటర్ నీటికి 2 ఎంఎల్ రోగోర్, అసిపేట్‌ను కలిపి పైరుపై పిచికారి చేయాలి. ఇలా పంట వివిధ దశల్లో మెలకువలను పాటిస్తే మంచి దిగుబడులను సాధించవచ్చు. రబీలో పంట సాగుచేసిన రైతులందరూ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి.

- ఉదయ్‌కుమార్, ఏఓ, సీకేపల్లి

శుద్ధ అబద్ధం

- పాఠశాలల్లో నిరుపయోగంగా శుద్ధజల యంత్రాలు
- కొన్నింటిలో నేటికీ అమర్చని వైనం



పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్



నిరుపయోగంగా వాటర్ ప్యూరిఫయర్

పెద్దవడుగూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. యంత్రాలు నాసిరకంగా ఉండటంతో కొన్ని నెలలు మాత్రమే పని చేశాయి. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు 46 ఉన్నాయి. అందులో 3587మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేశారు. తక్కువగా ఉన్న పాఠశాలల్లో వాటర్ ప్యూరిఫైడ్ యంత్రాలను అమర్చారు. బుర్నాకుంట, కోనాపురం గ్రామాల్లో ఎన్నికల కోడ్ కారణంగా బిగించలేదు. యంత్ర పరికరాలు పని చేయకపోవడంతో ఉపాధ్యాయులు చందాలు వేసుకొని మినరల్‌వాటర్‌ను కొనుగోలు చేసి విద్యార్థులకు అందిస్తున్నారు. పరికరాలు పనిచేయకపోతే ఎంబీఎంఎం యాప్ ద్వారా ఫిర్యాదుచేస్తే తక్షణమే మరమ్మతులు చేస్తారని గతంలో చెప్పారు. అయితే ప్రధానోపాధ్యాయులు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా స్పందన కరువైంది. ఇదేమిటని వారిని ప్రశ్నిస్తే ప్రభుత్వం మారింది మేము వచ్చి పనులు చేస్తే అందుకు సంబంధించిన బిల్లులు మంజూరు కావని చెప్పడంతో కొందరు ఉపాధ్యాయులు సొంతంగా డబ్బులు వేసుకుని చిన్న, చిన్న మరమ్మతులు చేయించుకుంటున్నారు.

యాప్ ద్వారా లాభం లేదు

నీటిశుద్ధి యంత్రాలు పని చేయకపోతే యాప్‌ద్వారా ఫిర్యాదు చేస్తే మరమ్మతులు చేస్తారని చెప్పారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేదు. దీంతో ఏమి చేయలేక మిన్నుకుండిపోతున్నాం.

- సుధాకర్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు, పెద్దవడుగూరు జడ్పీహెచ్ఎస్



హెలీప్యాడ్, సభాస్థలాన్ని పరిశీలిస్తున్న పయ్యావుల

ఇది పేదల ప్రభుత్వం

- మంత్రి పయ్యావుల కేశవ్

బొమ్మనహాళ్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తమది పేదల ప్రభుత్వమని, రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకెళుతోందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని నేమకల్లు గ్రామానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం వస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్ సభ స్థలాన్ని పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి నేమకల్లు గ్రామానికి చంద్రబాబు వస్తున్నట్లు తెలిపారు. హంగు ఆర్భాటాలు లేకుండా గ్రామస్థాయిలో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చెప్పినట్లుగానే మొదటి నెల నుంచే పింఛన్ పెంపు అమలు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా పాడైన రోడ్లకు కూడా మోక్షం కలిగిందన్నారు. హంద్రీనీవా సమస్య పరిష్కారంపై అధికారులకు ముఖ్యమంత్రి ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినట్లు వెల్లడించారు. రాయదుర్గం నియోజకవర్గంలో బీటీపీ, హెచ్చెల్సీ సమస్య, రోడ్ల అభివృద్ధి ప్రణాళికను ముఖ్యమంత్రికి వివరిస్తానని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, కన్వీనర్లు కేశవరెడ్డి, ధనుంజయ, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, అప్పారావు, ముల్లంగి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



రైలు వంతెన కింద ప్రవహిస్తున్న మురుగునీలో వస్తున్న ద్విచక్ర వాహనదారుడు

రైలు వంతెన కష్టాలు

- బ్రిడ్జి కింద పూడిక మట్టి, మురుగునీటి ప్రవాహం
- వాహనదారులు, పాదచారుల తీవ్ర ఇబ్బందులు



రైలు వంతెన కింద ట్రాఫిక్ జామ్ అవడంతో నిలిచిన ద్విచక్రవాహనదారులు

గుంతకల్లు టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుంతబావి వీధి సమీపంలో రైలు వంతెన వల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న వర్షం కురిసినా వంతెన కిందకు పెద్దఎత్తున మట్టి కొటుకొస్తోంది. దీనికి తోడు మురుగునీరు ప్రవహించడంతో రాకపోకలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ధర్మవరంగేట్ సమీపంలో గుంతబావి వద్ద రైలు వంతెన ఏర్పాటు చేశారు. గతంలో రైలు వంతెన కింద ఆటోలు, ద్విచక్రవాహనాలు, కాలినడక పాదాచారులు వెళ్లేవారు. ప్రస్తుతం ఆటోలు వెళ్లకుండా రోడ్డు మధ్యలో ఇనుప రాడ్‌లను ఏర్పాటు చేశారు. కేవలం ద్విచక్రవాహనాలు మాత్రమే వెళ్తున్నాయి. పాదచారులు వెళ్లాలంటే మురుగు నీటిలో నుంచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రతి పదినిమిషాలకు ఒకసారి రైలు గేట్ వేయడం వల్ల ద్విచక్రవాహనదారులు గుంతబావి కింద ఉన్న రైలు వంతెన కింద నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఒక్కోసారి పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అవుతుంది. దీంతో ఆ దారి గుండా ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైలు వంతెన కింద ఎప్పుడూ చూసిన మట్టి, మురుగు నీరు ప్రవహిస్తుండటంతో ద్విచక్రవాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే మురుగు నీరు ద్విచక్ర వాహనదారులమీద పడుతోందని వాపోతున్నారు. అయితే రైలు వంతెన కింద మరమ్మతులు చేసేందుకు తమకు అధికారం లేదని మున్సిపల్ అధికారులు అంటున్నారు.

సెంచరీతో మెరిసిన వీరా



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బీసీసీఐ క్రికెట్ పోటీల్లో ఆంధ్ర జట్టు ఆటగాడు వీరారెడ్డి సెంచరీతో మెరిశాడు. మంగళగిరిలో బీసీసీఐ అండర్-19 జాతీయ స్థాయి క్రికెట్ పోటీలలో భాగంగా శుక్రవారం ఆంధ్రా, ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన పోటీలో మొదటి ఇన్నింగ్స్‌లో ఆంధ్రా 139పరుగులకే ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన 85పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్రా జట్టులో జిల్లా క్రీడాకారుడు వీరారెడ్డి 106పరుగులు చేసి జట్టుకు భారీ స్కోర్ అందించాడు. ఆంధ్రా జట్టు 337పరుగులకు ఆలౌటైంది. సెంచరీ వీరుడు వీరారెడ్డిని జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందించారు.

పాండిచ్చేరిని పడగొట్టిన తేజస్విని.. చక్రిక



చక్రిక



తేజస్విని

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ అండర్-15 బాలికల జాతీయ క్రికెట్ పోటీల్లో జిల్లాకు చెందిన చక్రిక, తేజస్విని ప్రతిభ చాటారు. ఒడిశాలోని కటక్‌లో జరుగుతున్న బీసీసీఐ-15 జాతీయస్థాయి బాలికల క్రికెట్ పోటీల్లో ఆంధ్రా, పాండిచ్చేరి జట్లు తలపడ్డాయి&. ఆంధ్రా జట్టు 26ఓవర్లలో 3వికెట్లకు 124పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన పాండిచ్చేరి 24.2ఓవర్లలో 49పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఇందులో జిల్లా బౌలర్లు తేజస్విని 5, చక్రిక రెండు వికెట్లు పడగొట్టారు. వీరిని జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందించారు.

రేపు వడ్డెర్ల సంఘం ఉమ్మడి జిల్లా సమావేశం



మాట్లాడుతున్న దేవళ్ల మురళి

అనంతపురం అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐదో రోడ్డు సాయిబాబా ఆలయంలో ఆదివారం ఉమ్మడి జిల్లా వడ్డెర్ల సంఘం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వడ్డెర్ల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి పేర్కొన్నారు. స్థానిక శ్రీనివాస్ నగర్‌లోని వడ్డెర్ల సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో వడ్డెర్ల సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా నూతన అధ్యక్షుడిని ఎంపిక చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన వడ్డెర్లు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మల్లికార్జున, కుంచెపు వెంకటేష్, పెద్దమారెప్ప, అంజనేయులు, సంగప్ప, రవీంద్ర, వెంకటరమణ, సుధాకర్ పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో షెడ్ల నిర్మాణం




పాడిపశువుల షెడ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పాడి పశువులు, గొర్రెలు, మేకలు, పౌల్ట్రీ షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుంది. జిల్లాలో 1475 షెడ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఉపాధి పథకం జాబ్‌కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ సలీంబాషా కోరారు. ఆసక్తి, అర్హతగల జాబ్‌కార్డుదారులు సమీపంలోని ఉపాధి సిబ్బందిని సంప్రదించి డిసెంబరు 26లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వివిధ రకాలు..

ఉపాధి జాబ్‌కార్డు కలిగినవారికి ఐదెకరాల లోపు పొలం ఉండాలి. రెండు పశువులకు రూ.1.13లక్షలు, నాలుగు పశువులకు రూ.1.85లక్షలు, ఆరు పశువులకు రూ.2.30లక్షలు ఉపాధి పథకం ద్వారా ప్రభుత్వం నిధులు చెల్లిస్తుంది. పౌల్ట్రీ కోళ్లఫారాల నిర్మాణానికి సంబంధించి వంద కోళ్ల ఫారానికి రూ.87వేలు, 200కోళ్ల పెంపకం షెడ్‌కు రూ.1.32లక్షలు చెల్లిస్తుంది. మేకలు, గొర్రెల పెంపకానికి సంబంధించి 20గొర్రెలకు రూ.1.30లక్షలు, 50 గొర్రెలకు రూ.2.30లక్షలు చెల్లిస్తారు. అయితే ఇందులో జాబ్‌కార్డుదారుడైన లబ్ధిదారులు 30శాతం వాటా చెల్లించాల్సి ఉంటుంది.

ఎన్నికల బ్యాలెట్ బాక్స్ ఏర్పాటు



పోస్టల్ బ్యాలెట్ బాక్సును ఏర్పాటుచేస్తున్న ఏడీఆర్ఎం

గుంతకల్లు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మిక సంఘ గుర్తింపు కోసం నిర్వహించనున్న ఎన్నికల బ్యాలెట్ బ్యాక్స్‌ను ఏడీఆర్ఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. డిసెంబరు 4, 5, 6 తేదీల్లో రైల్వే కార్మిక సంఘ గుర్తింపు కోసం దేశవ్యాప్తంగా పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ఏడీఆర్ఎం సుధాకర్ తన చాంబర్‌లో పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌ను ఏర్పాటుచేశారు. శుక్రవారం నుంచి పోస్టల్ బ్యాలెట్ పేపర్లను స్వీకరించి డిసెంబరు 4నుంచి 6 వరకూ సాధారణ పోలింగ్‌ను నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి సీనియర్ డీపీఓ చౌహాన్, మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి విజయకుమార్, ఎంప్లాయీస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్, ఏడీఎస్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీలో కీలక పోస్టులు ఖాళీ

- ఇన్‌చార్జిలతో పాలన అంతంతే

అనంతపురం సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాలు శాఖ (ఆర్అండ్‌బీ) పరిధిలో పలు కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. ఏళ్ల తరబడి ఉద్యోగోన్నతులు లేకపోవడం, నెలలు తరబడి కీలక ఎస్ఈ పోస్టుకు రెగ్యులర్ ఉద్యోగులను నియమించకపోవడంతో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదు. పర్యవేక్షణ లేకపోవడంతో ఉద్యోగుల పనితీరు నానాటికీ తీసికట్టుగా మారింది. ఇన్‌చార్జ్‌ల పాలన ఉండటంతో కొందరు అధికారులు కార్యాలయాలకే రాకుండా సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారి రెగ్యులర్ కాకపోవడంతో కింద స్థాయి ఉద్యోగుల్లో కొందరు లెక్క చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్అండ్‌బీలో కీలకమైన ఎస్ఈ పోస్టులు సైతం రాయలసీమ ఉమ్మడి జిల్లాల్లో మూడు ఖాళీగా ఉన్నాయి. మొత్తంగా కీలక పోస్టులు ఖాళీగా ఉండటం, అర్హులైన డీఈఈలకు ఈఈగా ఉద్యోగోన్నతులు లేకపోవడం శాఖ పనితీరుపై ప్రభావం చూపుతోంది.

ప్రమోషన్‌ల కోసం ఎదురుచూపులు..

ఏ శాఖలోనైనా ఈఈ పోస్టు అనేది చాలా కీలకం. అంతటి కీలకమైన ఈఈ పోస్టులే ఆర్అండ్‌బీలో ఎక్కువగా ఖాళీ ఉన్నాయి. రాయలసీమ జిల్లాల్లోనే ఎక్కువగా ఎస్ఈ పోస్టులతో పాటు ఈఈ పోస్టుల్లోను రెగ్యులర్ అధికారులు లేకుండా ఉన్నారు. ఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికి అర్హులైన డీఈఈలకు ఏళ్ల తరబడి ఉద్యోగోన్నతి కల్పించడం లేదని బాధిత వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి ఆర్అండ్‌బీలో ఆయా కేడర్ల ప్రకారం రెగ్యులర్ అధికారులను నియమించడంతో పాటు అర్హులైన ఈఈలకు ఎస్ఈలుగా, డీఈఈలకు ఈఈలుగా ప్రమోషన్ కల్పించి, న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వానికి నివేదించాం

త్వరలోనే రెగ్యులర్ ఎస్ఈలతో పాటు అర్హులైన ఈఈలకు ఎస్ఈలుగా, డీఈఈలకు ఈఈలుగా ప్రమోషన్ కల్పించే విధంగా నివేదికను ప్రభుత్వానికి పంపాం. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తి అవుతుంది. రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో కొంత సమస్య ఉన్నమాట వాస్తవమే. అయినప్పటికి ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం ఇన్‌చార్జిలతో త్వరగా పనులు జరిగేలా చూస్తున్నాం.

-నయీముల్లా, ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ

రైళ్ల దారి మళ్లింపు

గుంతకల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లోని సిమెంట్ నగర్-కృష్ణమ్మ కోన సెక్షన్‌లో, పాణ్యం స్టేషన్ల వద్ద జరుగుతున్న డబ్లింగ్ పనుల కారణంగా గుంతకల్లు, గుత్తి మీదుగా వెళ్లే నాలుగు రైళ్లను దారి మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూరి-యశ్వంతపూర్ గరీబ్ రథ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (నం. 22883)ను డిసెంబరు 6న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22884)ను డిసెంబరు 7న జోన్ స్టేషన్ మీదుగా కాకుండా నంద్యాల, ఎర్రగుంట్ల, గుత్తి పోర్ట్, అనంతపురం మీదుగా మళ్లిస్తున్నామన్నారు. అలాగే హౌరా-యశ్వంతపూర్ వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నం. 22831) రైలును డిసెంబరు 4, 11 తేదీల్లో, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22832)ను డిసెంబరు 6, 13 తేదీల్లో గుత్తి-జోన్ సెక్షన్ మీదుగా కాకుండా అనంతపురం, గుత్తి పోర్ట్, ఎర్రగుంట్ల, నంద్యాల స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు వివరించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కౌంచ్...

జగదీశ్ చంద్రబోస్ (జయంతి)




'ఫాదర్ ఆఫ్ బెంగాలీ సైన్స్ ఫిక్షన్'గా పేరొందిన 'సర్ జగదీశ్ చంద్రబోస్ 1858 నవంబరు 30న బిక్రంపూర్ (ప్రస్తుతం బంగ్లాదేశ్)లో జన్మించారు. బయోలజిస్ట్, ఫిజిస్ట్, బొటానిస్ట్‌గా రాణించారు. సైన్స్ ఫిక్షన్‌పై ఎన్నో వ్యాసాలు రాశారు. రేడియో మైక్రోవేవ్ ఆప్టిక్స్‌పై పరిశోధనలు చేశారు. మొక్కల ఎదుగుదలకు సంబంధించి 'క్రెస్కోగ్రాఫ్' అనే పరికరాన్ని ఆవిష్కరించారు. పరిశోధనలకోసం ప్రత్యేకంగా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేశారు. భారతదేశం నుంచి 1904లో అమెరికాదేశపు పేటెంట్ పొందిన తొలి వ్యక్తి. 1937 నవంబరు 23న కన్నుమూశారు. ఆయన సేవలకుగాను బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ 50యూకే పౌండ్ కరెన్సీపై ఆయన చిత్రం ఏర్పాటు చేసింది.

విన్‌స్టన్ చర్చిల్ (జయంతి)



సాహిత్యంలో నోబెల్ ప్రైజ్ అందుకున్న 'సర్ విన్‌స్టన్ లియోనార్డ్ స్పెన్సర్ చర్చిల్ 1874 నవంబరు 30న ఆక్స్‌ఫర్డ్ షైర్‌లో శ్రీమంత కుటుంబంలో జన్మించారు. 1940-45 మధ్యన రెండో ప్రపంచయుద్ధ సమయంలో యునైటెడ్ కింగ్‌డమ్‌కు ప్రధానిగా వ్యవహరించారు. అనంతరం 1951-55 మధ్యన కూడా ప్రధానిగా కొనసాగారు. కన్సర్వేటివ్ పార్టీలో సుదీర్ఘకాలం కొనసాగారు. బ్రిటీష్ స్టేట్స్‌మన్, ఆర్మీ ఆఫీసర్, రచయితగాను రాణించారు. సంఘ సంస్కర్తగా, జంతుప్రేమికుడిగా పేరొందారు. 1965 జనవరి 24న కన్నుమూశారు.

గురజాడ అప్పారావు (వర్ధంతి)



సంఘ సంస్కర్త, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన అభ్యుదయ కవితా పితామహుడు, రచయిత గురజాడ అప్పారావు 1862 సెప్టెంబరు 21న అప్పటి విశాఖపట్నం జిల్లా (ప్రస్తుతం అనకాపల్లి జిల్లా) ఎలమంచిలి తాలూకా రాయవరం గ్రామంలో జన్మించారు. రచనల ద్వారా సమాజంలో మార్పుకు కృషి చేశారు. 'కన్యాశుల్కము' నాటకం సాహితీలోకంలో పేరొందింది. ఈ నాటకం కన్నడ, ఫ్రెంచ్, రష్యన్, ఇంగ్లీషు (2సార్లు), తమిళం, హిందీ (2సార్లు) అనువాదమైంది. సాహిత్యంలో వాడుకభాష ఒరవడికి కృషి చేశారు. కవిశేఖర బిరుదాంకితులు. 1915 నవంబరు 30న కన్నుమూశారు.

వాణీ జయరాం (జయంతి)



నేపథ్యగాయని, పద్మభూషణ్ గ్రహీత వాణీ జయరాం 1945 నవంబరు 30న తమిళనాడు రాష్ట్రం వేలూరులో జన్మించారు. అసలు పేరు కళైవాణి. సినీ నేపథ్య గాయనిగానే కాకుండా అనేక భారతీయ భాషలలో భక్తిగీతాలు, ప్రైవేట్ ఆల్బమ్స్‌కు పాటలు పాడారు. నాలుగు దశాబ్దాలలో వెయ్యి సినిమాలకుపైగా 20వేల పాటలు పాడారు. ఉత్తమ నేపథ్య గాయనిగా మూడు జాతీయ ఫిల్మ్ అవార్డులు, ఇతర పురస్కారాలు పొందారు. 2023 ఫిబ్రవరి 4న కన్నుమూశారు.

'సిరివెన్నెల' సీతారామశాస్త్రి (వర్ధంతి)



సినిమా పేరునే ఇంటి పేరుగా పేరొందిన 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో 1955 మే 20న జన్మించారు. గీత రచయితగా 'సిరివెన్నెల' సినిమాతో సినీరంగ ప్రవేశం చేసిన చేంబోలు సీతారామశాస్త్రి, పద్మశ్రీ పురస్కార గ్రహీత. సిరివెన్నెలలోని 'విధాత తలపున' పాట ఆయన జీవితాన్నే మార్చేసింది. లలితగీతాలు రాయడంలోనూ ఉపద్రష్టులు. ఉత్తమ గేయ రచయితగా పదికిపైగా నంది అవార్డులు, దక్షిణాది ఫిల్మ్ ఫేర్, కళాసాగర్, భరతముని, వంశీ బర్కిలీ పురస్కారాలు ఇతర గౌరవాలు అందుకున్నారు. 2021 నవంబరు 30న కన్నుమూశారు.

శోభారాజు (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత శోభా రాజు 1957 నవంబరు 30న చిత్తూరు జిల్లా వాయల్పాడులో జన్మించారు. భక్తి గీతాల గాయనిగా, రచయిత్రిగా, సంగీత దర్శకురాలిగా రాణించారు. ప్రత్యేకించి అన్నమాచార్య సంకీర్తనల ఆలాపనలో పేరొందారు. 'అన్నమాచార్య భావన వాహిని'ని ఏర్పాటు చేశారు. 16వ యేటకే ఆలిండియా రేడియోలో కళాకారిణిగా చేరారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు సలహాదారు రాలిగాను, సంగీత సాంస్కృతిక రంగాలలో పలు హోదాలలో కొనసాగారు. ద్వారకా తిరుమల దేవ స్థానంచే ఆస్థాన విదూషిగా గుర్తింపు పొందారు. 'వెంకటేశ్వర గీతమాలిక' ఆడియో ఆల్బమ్ ఎంతగానో పేరొందింది. పలు బుల్లితెర ప్రదర్శనలు, ధారా వాహికలకు దర్శకత్వం వహించారు. గౌరవ డాక్టరేట్, రాష్ట్ర ప్రభుత్వంచే ఉగాదికి హంస పురస్కారం, ఇతర గౌరవాలు పొందారు.

చరిత్రపై అవగాహన పెరగాలి

- బీఈఓ నరేంద్రకుమార్ • విద్యార్థులకు ప్రశంసా పత్రాల అందజేత

శిడ్లఘట్ట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రాచీన భారత ఇతిహాసాలపై పిల్లల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని తద్వారా సాహిత్యం, సంస్కృతి కళల పట్ల ఉత్సాహం సాధ్యమని బీఈఓ నరేంద్రకుమార్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రజాస్వామ్యం అనే అంశంపై పలు రకాల పోటీలను ప్రారంభించి మాట్లాడారు. స్వాతంత్ర్యానికి పూర్వం రాజుల పాలించిన ఆనవాళ్లు, స్మారకాలు వివిధ రాష్ట్రాలలో ఉన్నాయన్నారు. పలు చోట్ల ప్రాచీన స్మారకాలు పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దారని, ఇంకా ఇలాంటివి మార్చు చేయాల్సి ఉందన్నారు. వీటిని సందర్శించడం ద్వారా మన దేశ చరిత్ర, సంస్కృతులు, సామాజిక స్థితిగతులపై అవగాహన సాధ్యమన్నారు. క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం వంటి పోటీల ద్వారా విద్యార్థులను ప్రోత్సహించేలా విద్యాశాఖ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. బీఆర్‌పి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్మారకాలు దేశ ఆస్తిగా ఉన్నాయని వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇది సామాజిక, ఆర్థిక పురోగతికి దోహద పడుతుందన్నారు. సంయోజకులు వై మంజునాథ్ మాట్లాడుతూ స్మారకాలు వస్తు విషయాలని అవి మనకు ఉత్తమ మార్గదర్శనం, సందేశాలు ఇస్తాయన్నారు. వాటిని సందర్శించడం ద్వారా జ్ఞానార్జన సాధ్యమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కెహెచ్ ప్రెసెంట్‌కుమార్, సురేశ్, ప్రధానోపాధ్యాయురాలు మొబియన్ బేగం, ఇస్రత్, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.



వివిధ పోటీల విజేతలు ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ప్రెసిడెన్సీలో 3,879మందికి పట్టాల ప్రదానం



స్నాతకోత్సవ వేదికపై ప్రముఖులు

బెంగళూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రెసిడెన్సీ యూనివర్సిటీ ఏడో స్నాతకోత్సవం సందర్భంగా 3,879మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. చాన్స్‌లర్ డాక్టర్ నిసార్ అహ్మద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రెసిడెన్సీ యూనివర్సిటీ ఏటా విద్యార్థులలో సాధకులుగా తీర్చేందుకు కట్టుబడి ఉందన్నారు. పరిశోధనలకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రెసిడెన్సీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సల్మాన్ అహ్మద్ ముఖ్యులుగా పాల్గొన్నారు. కర్ణాటక రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ ఛైర్మన్ రాకేశ్‌సింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలలో దేశంలో విద్యావ్యవస్థలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. ఉన్నత విద్య సరళీకృతమైందన్నారు. అందుకే డిగ్రీ, పీజీలు చేసే విద్యార్థుల సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతోందన్నారు. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బిజయన్ ఇమ్మాను యేల్ అకడమిక్ వివరాలను ప్రకటించారు. 52 ప్రోగ్రామ్‌లలలో 40 యూజీ ప్రోగామ్‌లు, 12 పీజీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయన్నారు. 19మంది విద్యార్థులకు బంగారు బహుమతులు ప్రదానం చేశారు. వైస్‌చాన్స్‌లర్‌లు సుహైల్ అహ్మద్, సల్మాన్ అహ్మద్, డైరెక్టర్ డాక్టర్ నఫీజా అహ్మద్‌లు పాల్గొన్నారు.

కన్నడజ్యోతి రథానికి ఘన స్వాగతం

దొమ్మసంద్ర, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 87వ అఖిలభారత కన్నడ సాహిత్య సమ్మేళనానికి ఉద్దేశించిన కన్నడ జ్యోతి రథం ఆనేకల్ తాలూకాలోని దొమ్మసంద్రకు శుక్రవారం విచ్చేయగా ఘన స్వాగతం లభించింది. ఆనేకల్ కార్యనిర్వహణాధికారి మంజునాథ్, సర్జాపుర ఉప తహసీల్దార్ మంజునాథ్ నేతృత్వంలో కన్నడ జ్యోతి రథానికి పుష్పార్చన చేశారు. వెయ్యిమంది పాఠశాల విద్యార్థులు, గ్రామపంచాయతీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారులు, సర్జాపుర రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దొమ్మసంద్ర పురవీధులలో కన్నడ రథం ఊరేగగా గ్రామస్థులు ఘనంగా స్వాగతించారు. సాంస్కృతిక కళా బృందాలు, వీరగాసె డొళ్ళు కుణిత, గారడీ బొమ్మలు, విద్యార్థులు కన్నడ పతాకాలు, జాతీయ పతాకాలతో ఊరేగారు. కన్నడహబ్బను వీక్షించేందుకు జనసాగరం తరలి వచ్చిందా అనేలా సందడి నెలకొంది. దొమ్మసంద్ర గ్రామ పంచాయతీ అధికారి మంజునాథ్‌రెడ్డి, ఆర్ఐ సునిల్, గ్రామపాలనాధికారి నాగరాజు, పంచాయతీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు ఉమేశ్‌బాబు, టీవీబాబు, గ్రామపంచాయతీ సభ్యులు సురేశ్, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.



కన్నడ రథానికి స్వాగతం పలుకుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదు

శిడ్లఘట్ట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తాలూకా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటైన సమావేశంలో లోకాయుక్త ఎస్పీ ఆంటోనిజాన్ ప్రజలనుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలు ఆలకించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆయాశాఖల అధికారులు ప్రజల సమస్యలను సావధానంగా ఆలకిస్తే 90శాతం పరిష్కారమవుతాయన్నారు. చాలాచోట్ల అధికారులు పలు కారణాలతో ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. పట్టణంలో స్వచ్ఛత సమస్యపై కూడా కొందరు ఫిర్యాదు చేశారన్నారు. స్థానికంగా ఉన్న చిన్నపాటి సమస్యలను కూడా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. వీటిపై కమిషనర్, అధికారులకు సూచనలు చేశామన్నారు. సమావేశంలో 43 అర్జీలు వచ్చాయని రెవెన్యూ, సర్వే, తాలూకా పంచాయతీలకు సంబంధించిన సమస్యలు వచ్చాయన్నారు. సమావేశంలో డీఎస్పీ వీరేంద్రకుమార్, తహసీల్దార్ బిఎన్ స్వామి, సిబ్బంది మాళప్ప, లింగరాజు, దేవరాజు, జయమ్మ, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న లోకాయుక్త ఎస్పీ ఆంటోనిజాన్

యువకుల వీలింగ్.. వాహన యజమానిపై కేసు

బంగారపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బంగారపేట తాలూకా బూదికోటె పోలీస్ స్టేషన్ పరిధిలోని బంగారపేట - టేకల్ మెయిన్‌రోడ్డులో రామాపుర సమీపాన ద్విచక్ర వాహనంపై మైనరు యువకులు వీలింగ్ చేశారు. ఈ మేరకు ద్విచక్ర వాహనం ఇచ్చిన యజమానిపై కేసు నమోదు చేశారు. రామాపుర సమీపాన ద్విచక్రవాహనంపై వీలింగ్ చేస్తూ ఇతర వాహనచోదకులను బెంబేలెత్తించారు. ఇందుకు సంబంధించి వీడియోను సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. మైనరులకు ద్విచక్రవాహనం ఇచ్చిన మేరకు వాహన యజమాని, రామలింగాపుర గ్రామవాసి మునియప్పపై కేసు నమోదు చేసి ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై జిల్లా ఎస్పీ కేఎం శాంతరాజు శుక్రవారం స్పందిస్తూ ఇకపై జాతీయ రహదారులు, బహిరంగ ప్రదేశాలలో ఎవరూ వీలింగ్ చేయరాదని, ప్రజలకు ఇబ్బంది కలిగించరాదన్నారు. లేని పక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

చెత్తదిబ్బలను తొలగించండి

బంగారపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తాలూకాలో అత్యధిక పంచాయతీ సభ్యులు కల్గిన డీకేహళ్ళి పంచాయతీ పట్టణపంచాయతీగా మారే అవకాశం ఉంది. అయితే పంచాయతీ పరిధిలోని హొసహళ్ళి గ్రామం సహా అనేక రోడ్ల పక్కన, పారిశ్రామిక ప్రదేశ ప్రాంతాలలో చెత్తదిబ్బలు పేరుకు పోవడంపై దుర్గంధం నెలకొంది. దీంతో సంచరించేందుకు పెను సమస్యగా మారిందని వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు. బంగారపేట, కెజిఎఫ్ ప్రధాన రహదారి పక్కన మాంసం దుకాణదారులు వ్యర్థాలు పడేస్తున్నారు. దుర్గంధానికి ఇవి కూడా కారణమవుతుండగా వ్యర్థాలకోసం వీధికుక్కల ఆగడాలు అధికమయ్యాయి.

సమగ్రత కొరవడిన వైనం

సాధారణంగా తడి, పొడి చెత్త వ్యర్థాలను గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు వేర్వేరుగా వేయాల్సి ఉంటుంది. అయితే ట్రాక్టర్ వారానికోసారి వస్తోంది. దీంతో ఇంట్లో నిల్వ ఉంచుకోవడం సాధ్యం కాక ఇళ్లలోని చెత్త, కూరగాయల వ్యర్థాలను రోడ్డుపక్కన పడేస్తున్నారు. చెత్తదిబ్బల కారణంగా దోమలబెడద అధికమైంది. రెండు రోజులుగా తుంపర వర్షం కురుస్తుండడంతో దోమలు అధికమయ్యాయి. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేపట్టాల్సి ఉంది. ఈ దిశగా పీడీఓగానీ, గ్రామపంచాయతీ సభ్యులుగానీ స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సకాలంలో చెత్త సేకరణ ప్రక్రియ జరిగితే సమస్య ఇంతటి తీవ్రమయ్యే అవకాశం ఉండదని తెలుస్తోంది. ఇకనైనా పేరుకున్న చెత్తదిబ్బలను తొలగించడమే కాక చెత్త సేకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మాంసం వ్యర్థాలకోసం చెత్తదిబ్బలో వీధికుక్కలు



దాసర హొసహళ్ళి మార్గంలో పేరుకున్న చెత్తదిబ్బ

పిల్లల అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలు: మంత్రి



ప్రత్యేక నమూనా



శౌర్య పురస్కారాలు అందుకున్నవారితో మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్

బెంగళూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పిల్లల అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలు తీసుకురాదలిచామని స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ తెలిపారు. కబ్బన్‌పార్క్‌లోని బాలభవన్‌లో చిన్నారులలో సాధకులకు శౌర్య, అత్యుత్తమ సేవా పురస్కారాల ప్రదానం శుక్రవారం జరిగింది. చిన్నారులు దేశశక్తిని, భవిష్యత్తు అని కొనియాడారు. ఇదే సందర్భంగా పుష్పప్రదర్శన ఆకట్టుకుంది. కొవిడ్ వేళ నిలిచిపోయిన మ్యూజిక్‌స్టాండ్‌లో నాట్యతరంగను పునరారంభించారు. ఈ సందర్భంగా నాట్య కళాకారుల బృందాలు ప్రదర్శించిన నృత్య రూపకాన్ని మంత్రి వీక్షించి అభినందించారు. ప్రత్యేకంగా రూపొందించిన నెమలి నమూనా, ఇతరత్రా వాటి వద్ద సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

మొరార్జీ పాఠశాలను సందర్శించిన రిటైర్డ్ జడ్జి జస్టిస్ సంతోష్ హెగ్డే

బళ్లారిరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భైరదేవనహళ్లి గ్రామ సమీపంలో ఉన్న మొరార్జీ పాఠశాలను శుక్రవారం సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ సంతోష్ హెగ్డే సందర్శించారు. విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. వారితో ముచ్చటించారు. విద్యార్థులకు చట్టం పట్ల, దాని పనితీరును వివరించారు. జడ్పీ సీఈవో రాహుల్ శరణప్ప, ప్రిన్సిపాల్ అనసూయ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి సంతోష్ హెగ్డే

కన్నడ సంస్కృతి, భాషకు అపారమైన చరిత్ర

» కెనరాబ్యాంకు రాజ్యోత్సవాలలో సీఎండీ



క్విజ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

బెంగళూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కన్నడ సంస్కృతి, భాషకు అపారమైన చరిత్ర ఉందని కెనరాబ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈఓ కే సత్యనారాయణ రాజు అభిప్రాయపడ్డారు. బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం కన్నడ రాజ్యోత్సవ వేడుకలు జరిపారు. కన్నడ కండువాలతో బ్యాంకు ముఖ్యులు భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ కన్నడ సంస్కృతి భాష, కళలకు నేటికీ సమాజంలో ప్రత్యేక ఆదరణ ఉందన్నారు. ప్రాంతీయ భాషల పట్ల ఎప్పటికీ అభిమానం తగ్గదన్నారు. చందన ఛానెల్‌లో క్విజ్ పోటీలు నిర్వహించే డాక్టర్ ఎన్ సోమశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్‌చంద్ర, జనరల్ మేనేజర్‌లు, డిజిఎంలు పాల్గొన్నారు. డాక్టర్ ఎన్ సోమశేఖర మాట్లాడుతూ కన్నడేతరులు భాషను నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. మీ ప్రాంతీయభాష నేర్చుకోవాలనే విధానం సముచితమైనదన్నారు. క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

విద్యారంగ సాధకులకు సన్మానం



సాధకులకు సన్మాన కార్యక్రమంలో ప్రముఖులు

బెంగళూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌ఏపీ నేషనల్ అవార్డుల ప్రదానంలో విద్యారంగ సాధకులకు అకడమిక్ అచీవ్‌మెంట్ పురస్కారాలతో సత్కరించారు. పీణ్యా రెండోస్టేజ్ రాజగోపాల నగర్‌లోని సన్‌రైజ్ పబ్లిక్‌స్కూల్ కార్యదర్శి డాక్టర్ మహేశ్, గంగానగర్‌లోని ఆల్విన్ పబ్లిక్ స్కూల్ కార్యదర్శి మహదేవ్ ఎన్, నందరామయ్యనపాళ్య దాసనపుర హోబళిలోని బ్లూమూన్ పబ్లిక్ స్కూల్ కార్యదర్శి చంద్రశేఖర్, ఆంధ్రహళ్ళి మెయిన్‌రోడ్డులోని అనుపమా విద్యామందిర పాఠశాల ప్రిన్సిపాల్ బీకే వెంకటేశ్‌లకు ఛండీఘడ్ యూనివర్సిటీ, క్యాంప్స్ సహకారంతో ఏర్పాటైన ఎఫ్‌ఏపీ నేషనల్ అవార్డు కార్యక్రమంలో అకడమిక్ అచీవ్‌మెంట్ పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ త్రిలోక్‌చంద్ర, పరిషత్ సభాపతి బసవరాజ్ హొరట్టి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్, ఇస్రో మాజీ అధ్యక్షుడు ఏఎస్ కిరణ్‌కుమార్, పంజాబ్‌లోని చండీఘడ్ ప్రో-చాన్స్‌లర్ డాక్టర్ ఆర్ఎస్ బావా, శశికుమార్‌లు పురస్కారాలను ప్రదానం చేశారు.

ఏపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు కోసం హెల్ప్‌డెస్క్


బెంగళూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి కృష్ణ, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాలకు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల కోసం బెంగళూరు టీడీపీ ఫోరం కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్టు ఫోరం ప్రతినిధులు ప్రకటించారు. డిసెంబరు 1న ఉదయం నుంచి సాయంత్రం దాకా స్పెషల్ డ్రైవ్ ఉంటుందన్నారు. బెంగళూరుతోపాటు కర్ణాటకలో నివసించే సంబంధిత జిల్లాల పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

టీఎస్ ఆర్టీసీ బుకింగ్ ఏజెంట్‌లకు అవకాశం

బెంగళూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆర్టీసీ బస్సులలో బెంగళూరు నుంచి ప్రయాణించేవారికోసం అడ్వాన్స్ బుకింగ్ ఏజెంట్‌లు చేరేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు టీఎస్‌ఆర్టీసీ ఏటీఎం ప్రసాద్‌గౌడ తెలిపారు. నగరంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బెంగళూరు నుంచి హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్, హనుమకొండ నగరాలకు టీఎస్‌ఆర్టీసీ బస్సు సర్వీసులు ఉన్నాయన్నారు. ప్రయాణీకులు సులభతరంగా టిక్కెట్‌లు బుక్ చేసుకునేందుకు వీలుగా ప్రాంతాలవారీగా ఏజెంట్‌లను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. గతంలో నాన్ ఏసీ సర్వీసులకు 5శాతం, ఏసీ సర్వీసులకు 7శాతం కమీషన్ ఉండేదన్నారు. ప్రస్తుతం అన్ని సర్వీసుల టిక్కెట్‌ల బుకింగ్‌లపై 10శాతం కమీషన్ ఇస్తామన్నారు. ఏజెన్సీ పొందేవారు గతంలో రూ.50వేలు నాన్ రీఫండ్ డిపాజిట్ చెల్లించాల్సి ఉండేదని, ప్రస్తుతం దీన్ని రూ.5వేలకు తగ్గించామని, ఒకేసారి ఐదేళ్లకు అనుమతులు ఇస్తామన్నారు.

కొత్త ఫీచర్‌లతో రియల్ మి

బెంగళూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్నాప్ డ్రాగన్ 8 ఎలైట్ ఫ్లాగ్‌షిప్ రియల్‌మి ఫోన్ నగరంలో లాంఛనంగా విడుదల చేశారు. శుక్రవారం నుంచి రియల్‌మి జిటి 7ప్రొ విక్రయాలు ప్రారంభించినట్టు ప్రకటించారు. దేశవ్యాప్తంగా అందుబాటులో ఉంటాయని సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. రియల్‌మిలో 12జిబి ర్యామ్, 256టిజి సామర్థ్యంతోనూ, 16జిబి ర్యామ్, 512 జిబి సామర్థ్యం కలిగిన మోడళ్లను విడుదల చేశారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.00	1,593.69
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,429	607
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,507	5,467
నీటి నిల్వ (టీఎంసీలు)	93.91	14.39

వరికోతకు అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు

● డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా



బళ్లారి సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరి కోతకు రైతుల నుంచి ఎక్కువ చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవని జిల్లా అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా హెచ్చరించారు. యంత్రాల అద్దె గంటకు రూ.2300 మించరాదన్నారు. ప్రసుత్త ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరిపంటకు మార్కెట్‌లో మంచి ధర లేకపోవడం, సకాలంలో వర్షాలు కురువకపోవడంతో రైతులు ఆర్థికభారంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. కంప్లి, సిరుగుప్ప తాలూకాల్లో వరికోత యంత్రాల యజమానులు గంటకు రూ.2500 నుంచి రూ.3000 వరకు అద్దె వసూలు చేస్తున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇప్పటికే రైతు నాయకులు, వరికోత యంత్రం యజమానితో సమావేశం నిర్వహించి రూ.2300 ధర నిర్ణయించాలని కోరారన్నారు. జిల్లాలో వరికోత యంత్రం యజమాని రూ.2300 ధరకు మించకుండా వరి కోయాలన్నారు. యంత్రాల యజమానులు తప్పుచేస్తే యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు



సిరుగుప్ప, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తాయమ్మదేవికి కార్తీకమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని ఆదోని రోడ్డులో వెలసిన తాయమ్మదేవి ఆలయంలో ప్రధాన అర్చకులు ప్రవీణ్ అమ్మవారికి పుష్పాలంకరణ, ఆకుల పూజ, కుంకుమార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం గావించారు.

పౌరసత్వంపై శిక్షణ శిబిరం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలీ హెచ్ నిరగుడి

బళ్లారి సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోనిసోనియాగాంధీ బీఈడీ కళాశాల వెంకావదూత మఠం దమ్మూరు గ్రామంలో పౌరసత్వంపై శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యాశాఖ డీన్ సాహెబ్ ఆలీహెచ్ నిరగుడి పౌరసత్వ ప్రాముఖ్యత, కార్యకలాపాల గురించి వివరించారు. అనంతరం కొట్టూరుస్వామి ఉపాధ్యాయ విద్యా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మల్లికార్జున విలువలు, లక్షణాల ప్రాముఖ్యతను వివరించారు. అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ వీరభద్రప్ప శిబిరాల ప్రవర్తన గురించి మాట్లాడారు. జీఈఎం సొసైటీ అధ్యక్షులు అల్మాస్ తబస్సుమ్, సెక్రటరీ తాజుద్దీన్, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ హఫీజా బేగం పాల్గొన్నారు

కారులో మంటలు

బళ్లారి సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హొసపేట తాలూకా ధర్మసాగర్ గ్రామ సమీపంలోని 67వ జాతీయ రహదారిపై గురువారం టాటాసఫారీ కారులో మంటలు చెలరేగాయి. తోరణగల్లు కాంట్రాక్టర్ బి.తిమ్మరాజు డ్రైవర్ సురేశ్‌తో కలిసి తోరణగల్లు నుంచి హొసపేట వైపు వెళుతుండగా కారులో సాంకేతిక లోపం తలెత్తడంతో కారు ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. వెంటనే కారు దిగి ప్రాణాలు కాపాడుకున్నారు. కారు పూర్తిగా దగ్ధమైంది. రూ.25.55 లక్షలు నష్టం వాటిల్లిందని పోలీసుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

ధర లేక అన్నదాత దిగాలు..!

- నేలచూపులు చూస్తున్న ధాన్యం ధర
- కొనేవారు లేక కల్లాల్లోనే వరి దిగుబడులు
- కొనుగోలు కేంద్రాలు ప్రారంభించని సర్కారు
- దిక్కుతోచని స్థితిలో రైతులు



ధర లేక రోడ్లపైనే రాసులుగా ఉన్న ధాన్యం

బళ్లారి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆశగా వరి నాట్లు వేశారు. నాటు పడినప్పటి నుంచీ ఏదో ఒకరకంగా ఇబ్బందులు పడ్డారు. నారు పోసినప్పటి నుంచి పైరుకు సక్రమంగా నీరందలేదు. మధ్యమధ్యలో తెగుళ్లసోకాయి. ఇలా అనేక కష్టాలు ఎదుర్కొని పంటను రైతులు కంటికి రెప్పలా కాడాపుకుంటూ వచ్చారు. పంట కోతకు వచ్చింది. సరే అనుకుని ఆనందపడ్డాడు. వారి ఆనందం అంతలోనే ఆవిరైంది. ఎంతో కష్టపడి పండించిన పంటకు ఇప్పుడు ధరలేక పోయింది. ధర నేలచూపులు చూస్తోంది. ఏమి చేయాలో తెలియక రైతులు తల్లడిల్లిపోతున్నారు.

● ఇది ఒక రైతు పరిస్థితి కాదు.. తుంగభద్ర జలాశయం కింద అందరి రైతుల పరిస్థితి. క్వింటా రూ.1800 నుంచి రూ.2 వేలు పలుకుతోంది. పంట చేతికి వచ్చాక రేటు పడిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర జలాశయం కింద బళ్లారి, కొప్పళ, విజయనగర, రాయచూరు జిల్లాల పరిధిలో రైతులు ఖరీఫ్‌లో వరి సాగు చేశారు. 3 లక్షల ఎకలాల్లో వరి సాగైనట్లు వ్యవసాయ శాఖ రికార్డులు చెబుతున్నాయి. వంద రోజుల్లో చేకొచ్చే పంటను రైతులు ఇప్పుడు కోతలు కోసి ధాన్యం రాసులు కల్లాల్లో వేసుకున్నారు. ధర తగ్గుముఖం పట్టడంతో వ్యాపారులు ముందుకు రావడం లేదు. కనీసం సర్కారు మద్దతు ధరతో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. ఇటు రేటు లేక, అటు అమ్ముడుపోక, గోదాముల్లో నిల్వ చేసేందుకు అవకాశం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎకరా పంట సాగుకు సరాసరి పెట్టుబడి రూ.25 వేల దాకా ఖర్చు పెట్టారు. ఇక కౌలు రైతులు అయితే పెట్టుబడి రూ.25, కౌలు రూ.25 మొత్తం రూ.50 వేల పెట్టుబడి పెట్టారు. గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు దిగులు చెందుతున్నారు. ఎకరాలో 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఈ ప్రకారం రూ.55 వేల రానుంది. ఇక కోతలు, వ్యవసాయ కూలీలు, కౌలు ఇలా అన్నీ పోతే ఏమీ మిగలడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వ్యాపారులు ధాన్యం కొనుగోళ్లకు ముందుకు రాకుండా పోతే మరి కొందరు రైతుల అవకాశాలను ఆసరాగా చేసుకుని అతి తక్కువ రేట్లకు కొనేందుకు చూస్తున్నారు. ప్రధానంగా ఈ ఏడాది వరి ధాన్యం ధర తగ్గడానికి వివిధ రాష్ట్రాల్లో కూడా పంట దిగుబడి అధికంగా రావడం, ఎగుమతులు లేకపోవడం వల్ల ధాన్యం రేటు తగ్గాయని కొందరు రైతులు అంటున్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులతో ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుంటే ఆందోళన

● మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు శనివారంలోపు రైతు ప్రారంభించకపోతే గాంధీ సర్కిల్‌లో భారీఎత్తున రాస్తారోకో నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు రైతుల కోసం వరిధాన్య కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, పంట నష్టపరిహారం కల్పించాలని నిరసిస్తూ నాల్గవ రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సమస్యలపై పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు రోజుల నుంచి ధర్నా చేస్తున్నా సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యధోరణి అవలంబిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ నాయకులు ధరప్ప నాయక మాట్లాడుతూ తాలుకాలో ఏ ఒక్క అధికారి తమ విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని ఆరోపించారు. అవినీతి బాటలో నడుస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీజేపీ తాలుకా అధ్యక్షుడు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు బెళగల్ శివప్ప, ఇబ్రహీంపురం ప్రముఖ నాయకులు గంగప్ప, ముదేనళ్లి వీరేష, మహదేవ, మైకేల్ వీరేష, ఈరన్నగౌడ, శివకుమార్ గౌడ, మహాలక్ష్మీ, సృజన, కార్యకర్తలు పాల్గొన్నారు.

కన్నడనాడులో పుట్టడమే పుణ్యం: వీసీ జయకర్

● ఘనంగా సువర్ణ కన్నడ రాజ్యోత్సవం



మాట్లాడుతున్న బెంగళూరు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జయకర

బళ్లారి సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సంస్కృతి, అహ్లాదకరమైన కళలు, భౌగోళిక ప్రత్యేకత, వైవిధ్యం కలిగిన కన్నడ నేలలో పుట్టడం పుణ్యమని బెంగళూరు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జయకర అన్నారు. విజయగనగరం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో శుక్రవారం ఏర్పాటు చేసిన సువర్ణ కర్ణాటక రాజ్యోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కర్ణాటకాలోని ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మాట్లాడే భాష, ఆచార వ్యవహారాలు, దుస్తులు మారుతుంటాయన్నారు. మనం ఎక్కడ మాట్లాడినా, కలుపుకుని మాట్లాడి భిన్నత్వంలో ఏకత్వాన్ని నిలబెట్టాలని సూచించారు. కర్ణాటక రాష్ట్ర ఆవిర్భవించి 69 ఏళ్ల పూర్తయ్యాయన్నారు. గతంలో మైసూరు రాష్ట్రంగా పేరుగాంచిన రాష్ట్రానికి 1973లో కర్ణాటకగా నామకరణంచేసి 50 ఏళ్లపూర్తి చేసుకున్నామని తెలిపారు. కన్నడ ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లినా కన్నడ పండుగ చేసుకునే గుణం కలిగి ఉండాలన్నారు. చారిత్రక నేపథ్యంలో ఉన్న కన్నడ సంస్కృతిని ఉన్నత స్థాయికి చేర్చేందుకు కన్నడ అభిమానులు కృషి చేయాలని కోరారు. సీనియర్ సాహితీవేత్త వీరభద్రప్ప మాట్లాడుతూ కన్నడ భాషకు ఘన చరిత్ర ఉందన్నారు. అనేక శాసనాలు, సాహిత్యం, పద్యాలు, రచనలు, వ్యాసాలు అందించడంలో కన్నడకు ఔన్నత్యం ఉందని, కన్నడ చరిత్రను తెలుసుకుని గౌరవించాలన్నారు. వైవిధ్యమైన నేల సర్వజాతులకు శాంతివనమైన కన్నడ మతాలకు అతీతంగా జీవిస్తోందన్నారు. కన్నడిగులు సంస్కారవంతమైన స్వభావాన్ని పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎం.మునిరాజు, కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు నిష్టిరుద్రప్ప, చన్నబసవన్న, రుద్రేశ్, మూల్యాంకన రమేశ్ ఓలేకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కన్నడ అభిమానులు

సభ్యుల సహకారంతోనే సహకార సంఘం అభివృద్ధి



మాట్లాడుతున్న సహకార సంఘం అధ్యక్షుడు సూరిబాబు

కంప్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉన్న ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘాల్లో ఉన్న ఖాతాదారుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని బీడీసీసీ బ్యాంకు అధ్యక్షుడు తిప్పేస్వామి అన్నారు. శుక్రవారం శిరిగేరి సమీపంలోని ముద్దటనూరు క్యాంపులో నూతనంగా కృషిపత్తిన సహకార సంఘం రూ.70 లక్షలతో గోడౌన్‌ను, కార్యాలయాన్ని ప్రారంభించారు. సహకార సంఘం అధ్యక్షుడు సూరిబాబు మాట్లాడుతూ తాము అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అంచెలంచెలుగా సంఘం అభివృద్ధి చెందుతూనే ఉందనానరు. తమకు రైతులతో పాటు సభ్యులు ఎంతో సహకారం అందిస్తున్నారూఅన్నారు. అలాగే తీసుకున్న రుణాలు కూడా సకాలంలో చెల్లిస్తున్నారని తెలిపారు. దీంతో సహకార సంఘం లాభాల బాటలో పయనిస్తోందన్నారు. మున్ముందు సిరుగుప్ప నియోజకవర్గంలోనే కాకుండా జిల్లాలోనే మాదరి సహకార సంఘంగా పేరు తీసుకువస్తామన్నారు. తమకు నాబార్డు కూడా ఎంతో సహకరించిందన్నారు. ప్రభుత్వాలు రైతులకు ఏ సదుపాయాలు ఇచ్చినా వాటిని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిదానందప్ప తాత, మాజీ ఎమ్మెల్యే టీఎం చంద్రశేఖరయ్య, బీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ చొక్క బసన్న గౌడ, జిల్లా మాజీ పంచాయతీ సభ్యులు భీమలింగప్ప, గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, క్షేత్ర అధికారి బాలప్ప, మంగళేష్, పరశురామ, నాగరాజు స్వామి, జడయ్యస్వామి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించండి



రైతులతో చర్చిస్తున్న తహసీల్దార్ నరసప్ప

కంప్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కురుగోడు ఏపీఎంసీ ఆవరణలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని కర్ణాటక రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకర్ తెలిపారు. పట్టణంలో కర్ణాటక ప్రాంత రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసనలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రైతులు వర్షాల వల్ల పూర్తి ఇబ్బందులు పడుతుంటే కాస్తో కూస్తో వచ్చిన పంటకు కూడా కొనుగోలు కేంద్రం లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు ఇష్టమొచ్చినట్లు కొనుగోలు చేస్తున్నారన్నారు. కురుగోడు తాలుకాలో వరి 13,200హెక్టార్లలో, మొక్కజొన్న 350 హెక్టార్లలో, కంది 800 హెక్టార్లలో సాగు చేశారన్నారు. నిరసన చేపడుతున్న ప్రాంతానికి తహసీల్దార్ నరసప్ప చేరుకుని వారితో చర్చలు జరిపారు. వెంటనే అధికారులకు విషయాన్ని తెలియజేస్తామని, ఏపీఎంసీ ఆవరణలోనే వరిధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. మధ్యవర్తి వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి గాలి బసవరాజు, తాలుకా అధ్యక్షుడు అమీన్‌సాబ్, జిల్లా కార్యాధ్యక్షులు గోవిందప్ప, జిల్లా అధ్యక్షులు హనుమంతప్ప, భీమనగౌడ, వీరేష్, రామన్న, గంగన్న, తిప్పయ్య, కల్లుడప్ప, బలరామ్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఘనంగా కన్నడ రాజ్యోత్సవం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ



200 మీటర్ల కన్నడ రాజ్యోత్సవ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తోరణగల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకాలోని తాళూరు గ్రామంలో శుక్రవారం కన్నడ రాజ్యోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రౌఢ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారామ్ హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులు 200 మీటర్ల కన్నడ జెండాను పట్టుకుని గ్రామవీధులలో ప్రదర్శించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసినవారిని సన్మానించారు. క్షేత్ర శిక్షణ అధికారి ఐఆర్ అక్కి, సమన్వయ అధికారులు శరణప్ప, కరశెట్టి పాఠశాల ఎస్‌డీఎంసీ అధ్యక్షులు, పాఠశాల గురువులు, ఉపాధ్యాయులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి



మాట్లాడుతున్న కార్మిక శాఖ జిల్లా అధికారి మౌనేష్

కంప్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పిల్లలను పనులకు తీసుకెళ్లకుండా పాఠశాలలో చేర్చి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని జిల్లా కార్మిక విభాగం అధికారి మౌనేష్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కార్మిక శాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పట్టణంలో ప్రతి ఆదివారం దుకాణ యజమానులు కార్మికులకు సెలవు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. బాల కార్మికులతో పనులు చేయించుకునే యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇందిరా నగర్‌లో ఉన్న పాఠశాలకు విద్యార్థులు రాకపోవడంపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలకు చేరుకుని ప్రధానోపాధ్యాయులు వసంత కుమార్‌తో చర్చించారు. వసంత్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో పిల్లలు రాపోయినా అక్కడి సమాజ పెద్దలతో చర్చించామని, ఇప్పటివరకు స్పందించలేదని తెలిపారు. వారితో పాటు తహసీల్దార్ శివరాజ్, ముఖ్య అధికారి దుర్గన్న, తాలుకా అధికారి శివకుమార్, బసవరాజు, విరుపాక్షి, లతీఫా బేగమ్, సీఆర్పీ వీరేష్, శోభ, అపరంజి పాల్గొన్నారు.

ఇటిగిలో సదుపాయాలు కల్పించండి



పీడీవో శేషగిరికి మనవిపత్రం ఇస్తున్న ఇటిగి గ్రామరైతులు

కంప్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సన్నాపురం గ్రామ పంచాయతీ ఇటిగి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని నేత్రావతి, ద్రాక్షాయణి, జయమ్మ, గంగమ్మ, పార్వతి, జయలక్ష్మి కోరారు. గ్రామ పంచాయతీ అధ్యక్షుడు రమణ, పీడీవో శేషగిరిలకు శుక్రవారం వారు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో 2వ వార్డు దేవాలయం వద్ద నుంచి మెయిన్ రోడ్డు వరకు మురుగు కాలువలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. గ్రామంలో మురుగు కాలువలు లేక ప్రతి ఇంటి ముందు నీరు నిలిచి ప్రజలు రోగాలబారిన పడుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఇందుకు పీడీవో శేషగిరి స్పందిస్తూ గ్రామంలో పర్యటించి అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు.

గ్రంథాలయం ప్రారంభం

బళ్లారిరూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : బళ్లారి తాలుకాలో మొట్టమొదటిసారిగా అమరాపురం గ్రామ పంచాయతీ, అమరాపురం గ్రామ బస్టాండ్ ఆవరణలో నూతన గ్రంథాలయాన్ని ఈవో మడిగిన బసప్ప, పంచాయతీ అభివృద్ధి అధికారి షెక్షావలీ ప్రారంభించారు. ఈవో బసప్ప మాట్లాడుతూ విద్యార్థులు బస్సులకు వెళ్లే సమయంలో బస్టాండ్ సమీపంలోని గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తే ఖాళీ సమయంలో పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు.



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న అధికారి షెక్షావలీ

హోసూరు జోన్

వివిధ శాఖలపై కలెక్టర్ సమీక్ష

హోసూరు(కృష్ణగిరి), నవంబరు29(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా గెజిటెడ్ అధికారుల సమావేశం కలెక్టరేట్‌లో ఏర్పాటైన సమావేశానికి కలెక్టర్ కె.ఎం.సరయు అధ్యక్షతన వహించారు. సమీక్షా సమావేశంలో అన్ని శాఖల తరుపున చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల పనులు, పూర్తయిన పనులు, పెండింగ్‌లో ఉన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. తమిళనాడు ఉపముఖ్యమంత్రి డిసెంబరు 5న కృష్ణగిరి జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొని వివిధ రంగాల ప్రభుత్వ సంక్షేమ సహాయాన్ని అందించనున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల సమావేశంలో జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు, సూపరింటెండెంట్ పి.తంగదురై అభివృద్ధి పనులను పరిశీలించారు. జిల్లా రెవిన్యూ అధికారి ఎ.సాధనకురళ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పెరియస్వామి, హోసూరు కార్పొరేషన్ కమీషనర్ హెచ్.ఎస్.శ్రీకాంత్, హోసూరు డిప్యూటీ కలెక్టర్ ప్రియంక, కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ పుష్ప, దేవదాయ శాఖ కమిషనర్ షాజహాన్, ప్రభుత్వ వైద్య కళాశాల అధ్యక్షుడు భూపతి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పళనిస్వామి, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ , జిల్లా క్రీడా అధికారి రాజగోపాల్ పాల్గొన్నారు.



ప్రభుత్వ వైద్యకళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సరయు

ట్రాఫిక్ నియమాలపై అవగాహన



ఏంజిల్ వేషధారణతో హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన

హోసూరు నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హోసూరులో 'నా ఊరు నా భూమి' నినాదంతో పాఠశాల విద్యార్థులు ట్రాఫిక్ నియమాలపై జాగృతి కల్పించారు. ఏంజెల్స్ వేషధారణలో ప్లకార్డులు ప్రదర్శించి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ల ధరించే అవశ్యతపై అవగాహన కల్పించారు. చెన్నై, బెంగళూరు జాతీయ రహదారి, హోసూరు నగరంలోని బాగలూరు రోడ్డు సర్కిల్ ప్రధాన రహదారి కూడలి వద్ద ప్రైవేట్ పాఠశాలల పిల్లలు ట్రాఫిక్‌లో దేవదూతల వేషధారణలతో పాల్గొన్నారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. వాహనచోదకులకు పూలు అందచేసి చైతన్యం కల్పించారు. హోసూరు మున్సిపల్ ట్రాఫిక్ పోలీస్ ఎస్ఐ సత్య, స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ భవాని రమేశ్, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

3న భక్తుల దినోత్సవం

హోసూరు నవంబరు 29(ఆంధ్రజ్యోతి): హోసూరు నారాయణేతాత ఆశ్రమ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ వెంకటేశ్వరస్వామి గురువుల పుట్టినరోజును డిసెంబరు 3న భక్తుల దినోత్సవంగా జరిపేందుకు ముమ్మరంగా పనులు కొనసాగుతున్నాయని తపోవన అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన జీవితాన్ని ఆధ్యాత్మికంగా ప్రవచనాలతో వందలాది భక్తులను సన్మార్గంల్లో నడిపిన గురువులన్నారు. తన 83వ ఏట కూడా గురువుల ప్రవచనంతోపాటు సాధువుల సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. గురువుల భక్తి భావనలను పుణికిపుచ్చుకున్న తాను మదగొండపల్లి సమీపంలోని 10 ఎకరాలలో తపోవనాన్ని ఏర్పాటు చేశానన్నారు. తపోవన ఆవరణలో దేవాలయాలు, ప్రార్థన మందిరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతినెలా గురువుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిఏటా ఆయన జన్మదినాన్ని అక్కడే జరిపేవారమని, ఈ సంవత్సరం హోసూరు ఆశ్రమంలో నిర్వహించాలని స్వామిజీ సూచించిన మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ధర్మస్థళ లక్ష దీపోత్సవానికి 35 టన్నుల బియ్యం, కూరగాయలు



ధర్మస్థళకు బయలుదేరుతున్న వాహనాలు

హోసూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో కర్ణాటక రాష్ట్రం దక్షిణకన్నడ జిల్లా ధర్మస్థళలో నిర్వహించే లక్ష దీపోత్సవానికి హోసూరు సమీపంలోని బాగలూరు ప్రాంత వ్యక్తులు ఏటా బియ్యం, కూరగాయలు పంపేవారు. ఇందులో భాగంగా 3 ట్రక్కుల్లో 35 టన్నుల బియ్యం, కూరగాయలను పంపించారు. 26వ సంవత్సరం కూడా బాగలూరులోని మంజునాథ స్వామి అన్నదాన కమిటీ తరపున 35 టన్నుల బియ్యం, కూరగాయలు పంపించారు. దీంతో పాటు 10 టన్నుల బియ్యం, గుమ్మడి, మిర్చి, వంకాయ, బీన్స్, బంగాళదుంపలు, పెసర, సొరకాయ సహ 35 టన్నుల కూరగాయలు పంపించారు. కార్యక్రమంలో సురేశ్ కుమార్, కృష్ణప్ప, యురేందర్ భక్తులు పాల్గొని వాహనాలకు పచ్చజెండా చూపారు.

గాయపడిన న్యాయవాదికి ఆర్థికసాయం

హోసూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని కోర్టు ఆవరణలో గాయపడిన న్యాయవాది కణ్ణన్ ప్రస్తుతం కావేరి ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. వైద్యఖర్చులకోసం అతడి కుటుంబ సభ్యులు బార్ అసోసియేషన్‌లను ఆశ్రయించడంతో బార్ అసోసియేషన్‌లు సానుకూలంగా స్పందించాయి. హోసూరు బార్ అసోసియేషన్ రూ.3.34 లక్షలు, కృష్ణగిరి జిల్లా న్యాయవాదుల అసోసియేషన్ రూ.2.75 లక్షలు, అడ్వకేట్స్ ఫెడరేషన్ రూ.1 లక్ష ఇలా మొత్తం రూ.7.09 లక్షలు అందజేశారు. ఆర్థిక సహాయ కార్యక్రమంలో హోసూరు బార్ అసోసియేషన్ కార్యనిర్వాహకులు ఆనందకుమార్, తిమ్మరాయప్ప, కృష్ణగిరి జిల్లా బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు గోవిందరాజులు, శక్తి నారాయణ, తమిళనాడు పాండిచ్చేరి బార్ అసోసియేషన్ ఫెడరేషన్ ఆఫీస్ బేరర్లు మారప్పన్, మురళీబాబు పాల్గొన్నారు. ఆర్థిక సాయంచేసినవారికి కణ్ణన్ కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.